నిర్ణయం



– వారణాసి ప్రసాదరావు

"జేబులో ని డబ్బులేమన్నా తీశావా శాంతా?" ఆఫీసుకు సిద్ధమవుతూ అడిగాను.

"డబ్బులా......నేను తీయలేదే" నిమ్మరసం అందిస్తూ అంది శాంత.

"సరిగ్గా చూడండి. అయినా నేనెందుకు తీస్తాను– తీస్తే చెప్పనా" మళ్ళీ అంది!

నిమ్మరసం తాగేసి కుర్చీలో స్థిమితంగా కూర్చుని జేబులో ని డబ్బు మళ్ళీ లెక్కపెట్టాను. సాధారణంగా జీతం డబ్బులు ఫస్టునే ఇంటి కిచ్చేయడం. మూడువందల దాకా నాకోసం ఉంచుకోవడం నా ఆనవాయితీ! డబ్బుల విషయంలో నాకు అజాగ్రత్త ఎక్కువ..... శాంత చాలా సార్లనేమాట ఈసారి నిజమవదుకదా....

"సరిపోయిందా....."

"లేదు సరిగ్గా వంద తక్కువ. నూట ఎనభై వుంది".

"గుర్తుతెచ్చుకోండి ఏమయినా ఖర్చు పెట్టా రేమో–అయినా మీకు మరీ అశ్రద్ధలెండి. చిన్న పిల్లాడికన్నా అన్యాయం. ఎంత డబ్బయినా జేబులో నే వదిలేస్తూ వుంటారు."

ఇక మొదలయింది.....!

వంద రూపాయలు పోయాయన్న బాధకన్నా "శాంత" వచనాలను భరించడం కష్టం! చిన్నప్పట్నుంచీ కష్టాల్లో పెరిగినా స్వయంకృషితో ఉన్నతస్థితికి వచ్చాను. తామిద్దరిలో ఎవరదృష్ట వంతులో మరి. శాంత తన ఇల్లాలయింది! నిజంగా తనొచ్చిన వేళావిశేషమే అంటుంది–తను వచ్చిన సంవత్సరమే మా తాతగారి ఆస్తి కొంత కోర్టు తీర్పు వలన నాకు సంక్రమించింది కాబట్టి!

ఏమయినా తను మరిచిపోలేనిది ఒక్కటే. అది తన సహజసిద్ధమైన ఆడంబర రహిత జీవితం! పేరుపొందిన ఓ కంపెనీలో ఉన్నతోద్యోగిగా నాజీతంలో మూడు వేలను ఇంటికి మినహాయిస్తే మిగిలిన మూడు వందలూ తన ఆరోగ్యానికీ, ఇతర ఖర్చులకు తప్పనిసరి అవుతుంది!

జీతం ఎన్నిసార్లు పెరిగినా తన ఖర్చు మాత్రం గత నాలుగేళ్ళుగా స్థిరంగా వుంటోంది. అవసరాల నిమిత్తం డబ్బును ఎంతగా ఖర్చుచేసినా లెక్క చేయని తను ఆ డబ్బు వృధాగా పోయినా ఎవరయినా దొంగిలించి నట్టు తెల్సినా బాధపడ తాడు.

"ఏమిటాలో చిస్తున్నారు– సరిపోయి నట్టేనా....?"

ఉలిక్కిపడ్డాను. "ఆ(... లేదు... లేదు అన్నట్టు రఘు తీసాడేమో వచ్చాక అడుగు. వస్తాను. టైమయింది... " "బాగుంది వాడెందుకు తీస్తాడండీ... అయినా మీవన్నీ ఖచ్చితమైన పద్ధతులాయె. అడిగితే ఎంతయినా యిస్తారు కానీ.... జేబులోంచి మమ్మల్ని తీయనివ్వరుగా...."

"ఏమో.... అవసరపడి తీసాడేమో.... అడుగు–" అని బయటపడ్డాను. రోడ్డుమీదికి వచ్చాక హాయిగా అన్పించింది. నూర్రూపాయల సంగతి మర్చిపోయాను. ఎందుకంటే– నూర్రూపాయల లోటును ఈ నెల ఖర్చుల్లో పూడ్చుకొగల అడ్జస్టుమెంటు గుణం నాలో వుంది కనుక. కానీ ఒక్కటే చిక్కు ... నిజాన్ని నిజంగానే చెప్పాలి. పెళ్ళయిన తర్వాత ముఖ్యంగా తమ ఆర్థిక స్థితిగతులు మెరుగయిన నాటి నుండీ తనకో స్టేటస్ గిరి గీసుకుని అక్కడ్నించి వెలుపలికి ససేమిరా చూడని శాంతతో నే అవలేక పోతున్నాడు అడ్జస్ట్‌మెంట్....!

★ ★ ★ ★

సాయంత్రం ఇంటికి వచ్చి ఆశ్చర్యపోయాను!

వాతావరణం మారిపోయి వుంది. మా వంశోద్ధారకుడు (బి. యి. సీటు రాక పాలిటిక్నిక్‌లో పాతిక వేలతో చదువులు వెలిగించీ, నిరుద్యోగ రాజ్యాన్ని చక్రవర్తిలా ఏలుతున్నాడు) స్కూటర్ మీద రాజ్యపాలనకు వెళ్ళేందుకు సిద్ధంగా వున్నాడు. శాంత తన పేరును తానే చెడగొట్టుకున్న దానిమల్లే వుంది!

"ఏమిటయింది ..." బూట్లు విప్పుకుంటూ అన్నాను.

"ఇంకేమవ్వాలి ... ఇంతకీ మీ డబ్బు సంగతే మయింది ..."

"సరిపోలేదు ... రఘును కనుక్కున్నావా ..."

"నేనుదయమే చెప్పాను కదండీ ... వాడుతీయనే

లేదన్నాడు. అయినా మిమ్మల్నననాలి లెండి ... అసలే ..."

"అబ్బా ... అసలేం జరిగిందో చెప్పక ఈ వాయింపులెందుకోయ్ శాంతం–" నవ్వుతూ అన్నాను.

"మీకు అంతావేళాకోళమే ...!! దాని కొడుకు లేడూ ... రమణగాడు! వాడూ మన చిన్నాడూ ఈ గదిలోనే. రాత్రంతా ఫాన్ క్రింద కూర్చుని తగలడ్డారు. పరీక్షలు కదా పోనీ కలిసి చదువుకుంటున్నారులే అని వెనకేసుకొచ్చారు కదా... దాని ఫలితమే ఇది....!"

నాకంతా అర్థమయిపోయింది!!

'దాని' – అంటే" మా పనిమనిషి రంగమ్మ కొడుకు రమణ టెన్త్ క్లాసు కుర్రాడు. వాడు పుట్టుకలో పేదయినా చదువులో ఉద్దండుడు. కష్టపడి చదువుతాడు. వయసుకు మించిన తెలివితేటలు కన్పిస్తుంటాయతనిలో ... ఏ భేషజాలూ తెలియని రమణతో పాటే ఒకే స్కూల్లో చదువుతోంది కిషోర్ అనబడే మా రెండో పుత్రరత్నం! అన్నింటా అమ్మ పోలిక ...! నాలాగా కష్టాల్లో పెరగకపోయినా కనీసం నా బుద్ధులతో నయినా పెరగాలని కోరుకొంటే దానికి వ్యతిరేకంగా పెరిగినవాడు!

"మీది మరీ చోద్యం లెద్దురూ ... పనిమనిషి కొడుకుతో మనవాడికి స్నేహమేమిటి ... కుంక మొహం వెధవ ... వాడున్నూ ..." అక్కసునంతా వెళ్ళగక్కుతోన్న శాంతను శాంతపరిచాను నెమ్మదిగా. ఇప్పట్నుంచీ వాళ్ళ మనసుల్లో అలాంటి బీజాలు నాటవద్దనీ – అదీగాక వాళ్ళిద్దరికీ చదువులో అలా పోటీ పెట్టటం వల్లనయినా చదువుతాడనీ నచ్చ చెప్పాను. అయినా కొడుకు చదువుల్లోని సారమేమిటో తెలియంది కాదు శాంతకు. అందుకే కాబోలు అయిష్టంగానైనా వూరుకొంటోంది రమణను చూసయినా నెగ్గుతాడేమోనని–!

"ఏమిటలా చూస్తారు –"

ఉలిక్కిపడ్డాను. శాంత అసలు విషయం ఇంకా చెప్పనే లేదనీ అదిప్పుడు మొదలవుతుందనీ గుర్తొచ్చి–

స్థిమితపడి అయ్యాను. కుర్చీలో కూర్చుంటూ.

నిర్ణయం

"అలా వచ్చి చదువుకుంటాడు కదాని మామూలు గానే అడిగాను .. ఏరా అయ్యగారి గదిలో డబ్బులేమయినా పడివుండటం చూసావా – అని. వాడలాంటిదేమీ చూడలేదనే అన్నాడు. ఒట్టు వేసాడు కూడా. కానీ అదుంది చూసారూ ... రంగి! దానికేమొచ్చిందో రోగం "నా కొడుక్కి దొంగతనం అంటకడుతున్నారా?" అంటూ రగడపడిపోతోంది ... వింటున్నారా ..."

"ఊ ... ఊ ..."

"అయినా పుచ్చుకాయల దొంగా అంటే భుజాలు తడుముకున్నట్టు చేయని దానికి వుళ్ళెక్కిందా మీదయిపోవడమెందుకట దానికి ... అయినా ఆ అలగా బుద్ధులు ఎక్కడికట పోతాయి? ఆ వెధవే తీసేసి తల్లికిచ్చేసి వుంటాడు నంగనాచిలా ... దరిద్రపుగొట్టు వెధవ! అయినా ఎవరి హద్దుల్లో వారి నుంచక నెత్తికెక్కించుకుంటే జరగాల్సినవే జరుగుతాయిలెండి ...!"

"శాంతా –" నాకే ఆశ్చర్యంగా వినిపించింది!

"ఏమిటి చెప్పండి"– రుసరుసల్లోనే వుంది రిప్లయ్.

"నిమ్మరసం ..."

"అదేమిటి సాయంత్రాలు కాఫీ గదా మీ అలవాటు"

"నిజమే! కానీ బుర్రంతా వేడెక్కిపోయింది."

"ఊఁ ... ఇదో సరసం, తెస్తానుండండి"

గబగబా తయారయ్యాను. ఈవెనింగ్ డ్రస్ వేసుకొని బయల్దేరాను. వెళ్ళేముందు గ్లాసెడు రసమూ తాగి – "సారీ శాంతా ... ఆ వందా నిజంగా పోలేదు ఆఫీసులో నా టేబులు సొరుగులోనే మరిచిపోయాను. ఆ విషయం రాగానే చెప్పాననుకో నా మతిమరుపు మీద మళ్ళీ విష్ణువ గీతాలు పాడతావని భయమేసి వచ్చిన వెంటనే చెప్పలేదు." అనేసి బుగ్గమీద చిటికేసి కదిలాను.

"అన్నట్టు ఆ కుర్రాడినేమీ అనవసరంగా ఆడిపోసుకోవద్దు" – హెచ్చరించి మరీ బయట పడ్డాను. నిజమనేది నిలకడ మీదనే తెలుస్తుంది అని మనసులో అనుకుంటూ.

శాంత గొంతు మరి వినిపించలేదు. బహుశా – ఏమిటీమనిషి ... అసలీయన ఈ యుగపు మనిషేనా ... అనుకుంటూ వింతగా బయటకు వెళ్తున్న నాకేసి చూస్తూ వుండిపోయి వుంటుంది కాబోలు

* * * * * *

"ఏరా చిన్నా రమణ రాలేదా" భోజనంచేసి టేబిలు పైనున్న పేపర్ని తీసుకుంటూ అన్నాను.

"వాడు రాడట డాడీ – అయినా వాళ్ళమ్మ వాడ్ని దం మారో దం చేసింది డాడీ" కిచకిచమన్నాడు చెప్పి.

మనసు చివ్వుమంది.

"నిజంగానా" అప్రయత్నంగా వచ్చింది నోటి వెంబడి.

"నిజం డాడీ – వాడోసారి మా క్లాసులో మా ఫ్రెండు పెన్ను కొట్టేసాడు కూడా. అప్పుడు మా మాస్టారూ చిన్న దం మారో దం ఇచ్చార్లెండి ..." వాడు తిక్కింద్రలట డాడీ.

"నోర్ముయ్యరా వెధవా ..."

"అదేమిటి వాడ్ని కసురుకుంటున్నారూ –" శాంత వస్తూనే అందుకుంది.

"అఁ ఏం లేదులే. నెలకు మూడు పెన్నులు పారేసే నీ కొడుకు ఎవరో ముచ్చటపడి యిచ్చిన పెన్నుతో నెట్టుకొస్తున్న వాడ్ని ఎద్దేవా చేస్తుంటేనూ ..."

"సర్లెండి వాడికీ వీడికా పోలిక ...?" మూతి తిప్పేసింది మెరుపు వేగంతో. "నువ్వు చదువుకోరా నాన్నా ... వాడు మరి రాడులే ... రావద్దన్నానుకూడా. కావలిస్తే నువ్వు మన జడ్జిగారబ్బాయితో కల్సి చదువుకో ... గుర్రం గుర్రంతోనే స్నేహం చేయాలి. గాడిద గాడిదతోనే చేయాలి ..."

"నోర్ముయ్యవే ... అసలు ఈ సంఘం గురించి నీకేం తెల్సు ... చలువరాతి మేడలు .. జిలుగు గుడ్డలు ... వూల కారుల్లో షికార్లు కోరుకొనే పెళ్ళామా ... ఆ మేడా గుడ్డా – కార్లూ నీవు అన్న ఆ గాడిదల శ్రమతోనే తయారయినవి. ఆ సంగతి తెల్సుకో" – ఆవేశంగా శ్రీశ్రీ గారిలా విరుచుకు పడిపోదామన్న నా తపనంతా నా అంగిట్లోనే మింగుడుపడిపోయింది పిల్లల ముందు అలా వాదించడం ఇష్టం లేక ...

మనసు మరల్చుకొనేందుకు పేపర్లో తలదూర్చాను.

* * * * * *

ఆఫీసు పనిమీద హైదరాబాద్ వెళ్ళి వచ్చి ఇంట్లో అడుగుపెడుతూ ఆశ్చర్యపోయాను. అదో విధమైన ప్రశాంతం ... అందరి మొహాల్లోనూ ఓ రకమైన అపరాధ భావన ... గమనించనే గమనించాను.

భోజనాలయ్యాక స్థిమితంగా పక్కమీదకు వాలుతూ అడిగాను శాంతను విశేషాలేమిటీ ...

"ఏముంటాయి ..."

"ఏమీ లేకుంటే నీవిలా వుండవే. తుఫాను ముందు ప్రశాంతంలా ..." బుగ్గ గిల్లాను.

"ఊఁ ... వెళ్ళొచ్చినా వేళాకోళం మానరు. అది లేదూ సుజాత .. రంగి కూతురు నూతిలో పడింది.

వెంటనే తీసి గద్దె పెట్టారులెండి ...! ఉలిక్కిపడి నిటారుగా కూర్చున్నాను.

"ఇంతకూ ఏమయిందనీ–

ఏముందీ నే చెపితే నమ్మారు కాదు ... అదో దాని తమ్ముడో ఆ వందా కంటబడిందనో ... అవసర పడిందనో కొట్టేసి వుంటారు. చివరికి చేసింది తప్పనో లేక తీసినట్టు వాళ్లమ్మకు తెల్సి పోయిందనో మళ్లీ భయపడి తెచ్చి మన ముందు గదిలోని టేబిలు పైన పెడుతూ కంటపడిపోయిందా వగలాడి..."

తర్వాత ...

"ఈ సంగ్తంతా తెల్సి రంగి వాళ్ళిద్దర్నీ చావ గొట్టింది. మళ్ళీ రోషానికేం తక్కువ లేదులెండి ... నూతిలో దూకిందట ... దూకదూ మాయలాడి!"

మైగాడ్ ... ఇంత చిన్న విషయం ఎంతవరకు వెళ్ళింది ... నా మనసు పరిపరి విధాలా పోసాగింది!

"పోనిద్దురూ... వాళ్ల విషయాలతో మీ మనసునెందుకు పాడుచేసుకోవడం. లేవండి – పెద్దాడు రెండో ఆట సినిమాకు ఫ్రెండ్సుతో వెళ్లాడు. చిన్నా మేడమీదకు పోయాడు."

ఉలిక్కిపడ్డాను. నా స్థితిని గమనించి నన్ను కొత్త మూడ్‌లోనికి తెచ్చేందుకు ప్రయోగిస్తోంది అస్త్రం! అంటే ఏదో విశేషమే ... ఈ అస్త్రం సాధారణంగా తన డిమాండ్సు ఏవయినా వుంటే బయటపెట్టే ముందు సంధిస్తూ వుంటుంది కాంత!

ఏదో మిస్టరీ వుండే ఉంటుంది ...!

* * * * * *

ఆదివారం –

అలవాటుగా క్లబ్‌కు వెళ్లదలుచుకోలేదు.

ఆ ప్రాంతం అభాగ్యుల నివాసం! రంగమ్మ ఉండేదక్కడే. ఒకప్పుడు బాగా బ్రతికిన రంగమ్మ కుటుంబం. ఇప్పుడు బ్రతికి చెడినదయింది. భర్త పోయినా కూతుర్నీ, కొడుకునూ తన రెక్కల కష్టంతో చదివిస్తూనే వుంది. కూతురు సుజాతను ఇంటర్ దాకా చదివించింది. ఫీజులకూ, పుస్తకాలకూ తను పనిచేసే స్థితిమంతులు ఆదుకొనేలా అభ్యర్థించేది రంగమ్మ. ఎందుకు రంగమ్మా కూతుర్ని చదివిస్తున్నావంటే ఆమె జవాబు – "బాబా దాని తండ్రే గనక బతికుంటే సదివించడా :.. పనిమనిషి కూతురు పనిమనిషిగానే బతకాలా ... అల్లు సదువుకోవాలే గానీ ఎంత వరకన్నా సదివిస్తాను. పస్తులుండయినా సదివిస్తాను బాబూ" అని.

ఆమె పట్టుదలకూ ఆత్మవిశ్వాసానికీ చలించి పోయేవాడు తను. పరోక్షంగా కాంతకేకాదు రంగమ్మకుకూడా తెలియకుండా ఎన్నోసార్లు ఆదుకున్నాడు.

రంగమ్మకు తగిన పిల్లలు వాళ్ళు! పట్టుదలనూ కృషినీ విద్యా యజ్ఞంలో ఆజ్యంగా పోసిన వాళ్ళు ...

సుజాత ఇంటర్ ఇంచుమించు ఫస్టుక్లాస్ మార్కులతో పాసయింది ... ఆపై చదువులకు ససేమిరా అంది! ఓసారి తనే అన్నాడు. ఏం సుజాతా చదవరాదా అని. లేదు బాబూ మరింక చదవను. అమ్మను ఇంకా ఈ స్థితిలో ఎన్నాళ్లని చూస్తాను... వచ్చే నెలలో నర్సు ట్రయినింగ్‌కు పిలుస్తారట. ఎప్లయి చేస్తే తప్పకుండా సెలెక్టు అవుతావన్నారు ప్రిన్సిపాలుగారు.

ముచ్చట వేసింది సుజాత మాటలకు. చదువుకున్న పిల్లనన్న భావం ఏ కోశానా లేకుండా తల్లితో బాటే సహాయంగా తనూ పనులు చేయబోవడం చూసి ఎన్నోసార్లు వారించాడు తను. ఏ శాప వశానో పేదరికపు ఛాయలో బ్రతుకుతోన్న ఆ పిల్లలిద్దరూ ప్రాణం పోయినా దొంగతనానికి ఒడిగట్టే వాళ్ళు కాదు. సుజాత పెద్దమనిషి కాక పూర్వం ఎంతో చనువుగా తన ఇంట్లో తన పిల్లల్తో పిల్లగా కల్సిపోయి తిరిగేది ... వ్యక్తురాలయిన తరువాత రాను రానూ రాకపోకలు తగ్గించి వేసింది

సుజాత తమ్ముడు రమణ పదేనేళ్లవాడు ... పుస్తకాలు తప్ప వాడికింకో ప్రపంచం లేనేలేదు. తనని సరిగ్గా కన్నెత్తి చూసేందుకయినా సాహసించని వాడు తన డబ్బు దొంగిలించగలిగే స్థాయికొచ్చాడా ... నో .. నెవ్వర్!



నా ఆలోచనల్లోనే ఆ ప్రాంతం దాటిపోయినందుకు నవ్వుకున్నాను.

రంగమ్మ ఇంటికి వెళ్లాలి. ఈ సమయంలో ఆవిడెలాగూ ఉండదు ... సుజాతను అసలు విషయం అడగాలి! కానీ ఆ ప్రాంతానికి వెళ్తే ఎవరైనా ఏదన్నా అనుకొనే ప్రమాదం ఉండొచ్చు. సంశయంలో ఉండగానే కనిపించాడు రమణ! వాణ్ణి పిలిచాను. వాడి మంచి చెడ్డలన్నీ తెల్సుకొని నెమ్మదిగా అడిగాను. అక్క యింట్లో వుందా –

తలూపాడు.

చూడు రమణా ...ఆ నర్సు ట్రయినింగు విషయమేదో మాట్లాడాలని అయ్యగారోసారి రమ్మంటున్నారని చెప్పు. వెళ్ళు అఁ చూడు ... అదిగో ఆ రామాలయం దగ్గరకు షికారుగా వెళ్తుంటాను కదా అక్కడికి రమ్మన్నానని చెప్పు – పంపించి నడక సాగించాను.

పది నిముషాలు గడిచినయ్.

సుజాత వస్తోంది. పమిట నిండుగా కప్పుకుని తల వంచుకొని వస్తోంది!

దగ్గరగా వచ్చి తలెత్తి చూసి చేతులు జోడించింది! ప్రతిగా విష్ చేస్తూ రా అమ్మాయ్ రా – ఆహ్వానించి కూర్చోమని చెప్పాను.

కోర్సువు ట్రయినింగూ పై చదువులూ అవీ మాట్లాడేను. డైరెక్టుగా అసలు విషయాలకు దిగితే ఆమెను మరింత డిస్టర్బ్ చేయడం తప్ప మరేం ప్రయోజనం వుండదని!!

సుజాతా ... మరేంలేదు. నేను హైదరాబాద్ వెళ్లాక ఏదో పొరపాటు చేశావని తెలిసింది నీవు చాలా బుద్ధిమంతురాలవని నా నమ్మకం ... కానీ జరిగిందేమిటో తెల్సుకుందామనీ ... ఇలా పిల్చాను.

"....."

సంశయించకు సుజాతా పెద్దవాడిని ... నీకు తండ్రిలాంటి వాడిని కూడా ... నా దగ్గరెందుకూ దాపరికం ... మరొక్క విషయం ఆ డబ్బేదో నీవు తీసావని నీ నోటితోనే చెప్పినా నమ్మను. కానీ ... నీవు

బాబుగారూ ... ఉగ్గబట్టుకున్నదల్లా ఒక్కసారిగా భోరుమంది.

అరరె ... ఏమిటీ చిన్న పిల్లలా ... నో ... నో ... ఓదార్చాను.

సుజాతా జరిగిందేమిటో చెప్పు ... ఏం చెప్పదల్చుకున్నావో నిర్భయంగా చెప్పు. బుజ్జగించాను ఆమె తల నిమురుతూ.

ఆఫ్టరాల్ ఓ వంద రూపాయల కారణంగా నీ నిండు జీవితాన్ని ముగించుకోవాలని చూసేవంటే ... అది ... అది కలలో కూడా నేను నమ్మలేనమ్మాయ్ ...!

సుజాత కన్నీరాగలేదు ... ఆమె మనస్సు కుదుట పడేందుకు మౌనంగా వుండిపోయాను.

కొన్ని క్షణాలు గడిచినయ్!

"నేను ... నేను ..." ఆమె చెప్తోంటే మెచ్చుకోలుగా చూసాను.

ఆమె చెప్పుకుపోతోంది ...!

* * * * * *

ఆల్‌రైట్! ఇన్నాళ్ళుగా తను దేన్ని పట్టించుకోవలసివుండి పట్టించుకోలేదో చివరికి దాని ఫలితమేమయిందో తెల్సివచ్చింది. అది– తల్చుకున్నకొద్దీ

ఆవేశం ముంచుకు రాసాగింది!

శాంతా ఏదీ ఆ చీటీ-నిగ్రహించుకొనేందుకు ప్రయత్నించసాగాను.

చీటీ ఏమిటండీ?

సుజాత రాసినది.

సుజాత రాయడమేమిటండీ......

షటప్. నా కంతా తెల్సు. ఎందుకలా చేసావ్? కేవలం....కేవలం ఓ వంద రూపాయల కారణంగా సాటి ఆడదాని బ్రతుకు బూడిదయ్యేందుకు కారణమయ్యావేం? గుమ్మంలో స్కూటర్ చప్పుడు వినబడటంతో టిన్నన్‌గానిలబడ్డాను.

రఘూ-నా ఆవేశం కట్టలు తెంచుకుంది

ఏమిటి డాడీ-

రాస్కెల్....ఇడియట్-పటాసుల్లా పేలినయ్ వాడి బుగ్గలు!

నా ఆవేశం చల్లారేటప్పటికి అవి రక్తం చిందేందుకు సిద్ధంగా వున్నాయ్! ఒక్కసారిగా దుఃఖం కోపం, తెలియని కసీ, ఉద్వేగం, సానుభూతీ ఏమిటేమిటో అన్నీ ఒక్కసారిగా నా మీద దాడి చేస్తుండగా నిస్త్రాణగా కూలబడి పోయాను. ఆవేశం అణగారింది! దీర్ఘంగా నిట్టూర్చాను.

నా ఆవేశాన్ని అడ్డుకోబోయిన శాంత మూలకుపోయి రోదిస్తోంది....! చూడండీ- మీరు ఈ రెండతస్తుల భవనంలో వుంటున్నారు. మూడు పూటలా మృష్టాన్న భోజనం తింటున్నారు. జల్సాగా విలాస జీవితం గడుపు తున్నారు. వీటన్నిటికీ కారణం నేను! అలాంటి జీవితాలకు అలవాటు పడిపోయి అవే శాశ్వత మనుకుంటూ పైకెగరాలని చూసారు మీరు నిలబడిన నేలనే మర్చిపోయారు అందుక్కూడ కారణం నేనే!

ఎలా అంటారేమో.... నా భార్యాబిడ్డలు సుఖంగా జీవించాలనీ.... ఒకరి దయాదాక్షిణ్యాలపై బ్రతకరాదనీ.... ఎన్నో కష్ట నష్టాలు భరించీ స్వయంశక్తితో పైకి వచ్చిన నేను ఆ కష్ట నష్టాలేవీ మీకు తెలియనివ్వకుండా సుఖాలన్నీ మీకు అమర్చి పెట్టానుగా అదీ కారణం....! పస్తులతో సైతం కొన్నాళ్ళు గడిపిన నేను- మీ సుఖం ఆనందాలే నా "కడుపు నిండు" అని భావించాను. కానీ ఆ సుఖాలే మీ కళ్ళకు పొరలు కప్పించి కష్టజీవుల బ్రతుకులో తొంగి చూడనీయకుండా అడుకునేలా చేస్తాయని భావించ లేదు....! ఆల్‌రైట్....! నేనిప్పుడు తెల్సుకో గల్గాను. నేనెంత పొరపాటు చేసానో.... ఇప్పుడు చెప్తున్నాను వినండి.... ఇప్పుడు జరిగిందానికి ప్రాయశ్చిత్తం జరగాలి. సుఖాలవల్ల మీ కళ్ళ ముందు ఏర్పడ్డ భ్రమలు సైతం తొలగిపోవాలి.... అందుకోసం.... అందుకోసం....!" ఒక్కక్షణం ఆగి ఊపిరి పీల్చుకుని ధృఢంగా చెప్పేను నా నిర్ణయాన్ని!

'డాడీ-"

"ఏవిటండీ మీరంటున్నదీ.... మీకేం మతిపోలేదు కదా...."

"షటప్.... ఇంకా పోలేదు కనకనే స్థిమితంగా చెప్తున్నాను.... నా నిర్ణయానికిక తిరుగు లేదు.... అంతే!"

నిర్ణయం

"హుఁ....! నిర్ణయం... ఏమిటండీ మీ నిర్ణయం....!? మన పరువు మర్యాదల సంగతి మరిచిపోయి ఏం మాట్లాడుతున్నారో తెల్సా...."

"తెలుసు! ఆ పరువు మర్యాదలన్నవి ప్రవర్తన శీలాన్నిబట్టి కాక కేవలం డబ్బుతో నే లెక్కవేసే నీ వల్లనే వీడిలా తయారయ్యాడన్న తిరుగులేని నిజమూ తెల్సు....! వీడినలా పెంచినందుకూ.... ఆ పంపకంలో నన్ను జోక్యం చేసుకోనివ్వకుండా వెనకేసు కొచ్చినందుకూ నీకిది సరయిన శిక్ష అవుతుంది కూడా.... ఒరేయ్.... జీవితంలో ఓనమాలు తెలీని వెధవా.... తెల్సుకో! మనిషిగా ఎలా బ్రతకాలో ఎందుకు బ్రతకాలో తెల్సుకో- నా నిర్ణయం నీ వది ఖచ్చితంగా తెల్సుకొనేలా చేస్తుందిలే- ఫో...."

ఇక చెప్పదల్చుకున్నది ఏమీలేనట్టుగా నిట్టూర్చి అక్కడ్నించి నిష్క్రమించాను.

* * * *

జవితం నేర్పిన అనుభవాల్లోంచి నిర్ణయాలు ఎన్నెన్ని తీసుకున్నా ఖచ్చితంగా వాటి నమలు జరపడంలో బలహీనులయితే ఎలా వుంటుందో నాకు నేనే ఉదాహరణంగా మిగిలిన నేను ఒక్కసారిగా దృఢ సంకల్పంతో నిట్టూర్చాను....

సుజాత తమ కోడలుగా వచ్చి తీరుతుంది. ఈ నిర్ణయంలో పునరాలోచన లేనే లేదు! అందుకనేమో- కడుపు నిండ కున్నా మనసు "నిండు"గా వుంది! డాబాపైన వెన్నెల్లో గతాన్ని నెమరేసుకున్న కళ్ళకు ఎప్పుడు మగత వచ్చిందో తెలీదు.... మనసు తెరలపై సుజాత కదలాడ సాగింది! విచిత్రమైనది.... విధి! పద్దెనిమిదేళ్ళ సుజాత.... వినయం... విధేయతలతో మెరిసే సుజాత తన కోడలుగా రాబోతోంది....!! సూటు బూటుల్లో దర్జాగా మెరిసిపోతూ కాలేజీ నాలుగ్గోడల మధ్య జీవితాన్ని నేర్చుకొచ్చిన తన కొడుకు అందుబాటులో వున్న సుజాతను అంచుకున్నాడు..!

పాపం ఆ పిచ్చి పిల్ల ఎలా లొంగి పోయిందో ఏమిటో అబలగా మిగిలి....!

తన జేబులోంచి డబ్బుతీసి రూపాయికో చాక్లెట్ కొని రేపర్నూడదీసి తిని పారేస్తూ పెరిగిన కొడుకు తను పొందిన ఆ తియ్యని అనుభవానిక్కూడా ఓ వంద పారెయ్యా లనుకున్నాడు కాబోలు ... డాడీ జేబులో ఎంతుంటుందో ఆయనకే లెక్క వుండదను కున్నాడేమో- గాఁరంతో జేబుల్లోంచి డబ్బుతీస్తే వెనుకటి రోజులు గుర్తొచ్చి!

"ఈ డబ్బుతో కడుపులాంటి దేదయినా వస్తే తీయించేసుకో" - రాసిన స్లిప్‌నూ వందనోటునూ కవర్లో పెట్టి దార్లో కనబడిన సుజాత కిచ్చిన ఘనుడు- తన వంశోద్ధారకు డయ్యాడు....!

తర్వాతి కథలో రమణ తీసాడేమో అని శాంత పరోక్షంగా ఆరోపించడం.... రమణను వాడి తల్లి దండించడం జరిగినయ్... కానీ నిప్పుమిద నివురు తొలగినట్టుగా- అనాలోచితంగా సుజాత తమ్ముడి పుస్తకాల్లో దాచిన నోటు రంగమ్మ కంట పడనే పడింది! అప్పటికే పిచ్చి పిల్ల నిజం చెపితే బాగుండేది.... కానీ గొప్పవాళ్ళతో చెలగాటమనో.... తమ లాంటి వారి కోపాలు తమకే చేటనో- పెదవి విప్పింది కాదు.... చెయ్యని నేరానికి శిక్ష అనుభవించడమే కాక దొంగగా ముద్రవడ్డ తమ్ముడ్ని చూసాక మానసిక సంఘర్షణను జయించలేక పోయింది....!

"ఈ వంద నోటు మా తమ్ముడు దొంగిలించింది కాదు.... మీ పెద్దబ్బాయి నాకు ఇచ్చింది....! ఈ డబ్బు నా కెందు కిచ్చారో న్యాయం.... దైవం.... పాపభయాల్లో ఏ ఒక్కటయినా మీ అబ్బాయికి వుంటే నా ఎదుటే నిలదీసి అడగండి-" తెగించి అడిగెయ్యాలని వచ్చిన పిల్ల.... అది మళ్ళా తనకే చేటవుతుందని భయపడింది కాబోలు.... అడగ దల్చుకున్న మాటలు కాగితమ్మీద రాసి దాన్ని వందనోటుతో జతపర్చి తన ఇంట్లో డ్రెస్సింగ్ టేబిలు పైన పెడుతూ శాంత కంట పడింది....!

కాగితమ్ముక్కలో రాసింది చదివి చించి పారేసిన శాంత జరగరానిదేదో జరిగే వుంటుందని ఊహించి, ఆ నిజమేమిటో తెల్సుకోకుండా.... ఆ పాపమేదో మళ్ళీ తన కొడుకు మీదికే వస్తుందన్న భయం కొద్దీ తిరిగి దొంగతనం నేరం అంటగట్టింది అక్కా తమ్ముళ్ళపైన.... సంగతి తెల్సి మళ్ళీ రెచ్చిపోయింది రంగమ్మ. అపై ఇక అసలు విషయం తల్లికి తెలిస్తే ఏమవుతుందో ఊహించుకున్న సుజాత తన రహస్యాన్ని తనతో పాటు నిక్షిప్తం చేయాలను కుంది....! పూర్ సుజాతా.... నీలాంటి ఆడపిల్లలు చేయాల్సింది ఆ పని కాదమ్మా.... అలా మిమ్మల్ని అన్యాయం చేసిన మగాళ్ళను చొక్కా కాలరు పట్టుకుని ధైర్యంగా నడిబజార్లోనే నిలదీయ గలగాలి.... అదీ మీరు చేయాల్సింది! ఆ చొరవా.... ధైర్యం లేనప్పుడు మీకు కాలేజీ యూనివర్సిటీ చదువు లెందుకూ.... దాటు మాటు శ్రమ లెందుకూ....?! □

అమ్మ 'తోడు'

–చిన్నప్పుడు
తప్పటడుగులు వేస్తూ నడిచేటప్పుడు
అడుగులు వేసేదు-
"అమ్మ- తోడు"గా
–మధ్యప్పుడు
అబద్ధాలను నిజం చేసేటప్పుడు
చేతిలో చెయ్యి వేసేదు
"అమ్మ తోడు"గా
–పెద్దప్పుడు
పాల గుండెల పడతిపక్కలో వున్నప్పుడు
ఆలోచించి నిర్ణయానికి వచ్చేదు
అమ్మ ★ "తోడు"గా

–డా. అయల సోమయాజుల గోపాలరావు

★పాలను విరిచే మజ్జిగ